# మనుషుల భయం

రామశేషు గుంటూరులో వుంటున్నాడుట. భార్య ఇందిర కూడా వున్నదిట. వాళ్లిద్దరూ బ్రాడీపేటలో రెండు గదుల ఇంటిని అద్దెకు తీసుకుని ఎందుకో వుంటున్నారు కూడా చెప్పాడు గురుదేవరాయలు.

గురుదేవరాయలు నా స్నేహితుడు. రామశేషు అతనికి తెలుసు. రామశేషు భార్య ఇందిర గురుదేవరాయలు బంధువులమ్మాయి.

కొన్నాళ్లుగా రామశేషు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. అది ఈమధ్య కొంచెం తీవ్రం కావడంతో ట్రీట్‌మెంట్‌కోసం ఇటీవల భార్యతో గుంటూరు వచ్చి వుంటున్నాడుట. రామశేషు గుంటూరువాడే. నా బాల్యస్నేహితుడు. ఉద్యోగరీత్యా నెల్లూరులో వుంటున్నాడు.

ఉదయం ఎనిమిది గంటలకు నా స్నేహితుడు గురుదేవరాయలు ఫోన్ చేసి రామశేషు గురించి చెప్పాడు. రామశేషును చూడటానికి పది గంటలకు వెళుతున్నాడుట. నేను కూడా వస్తానంటే మా ఇంటికి వస్తానన్నాడు. రమ్మన్నాను.

గురుదేవరాయలు సరిగ్గా పది గంటలకు తన లూనా మీద మా ఇంటికి వచ్చాడు. ఇద్దరం రామశేషు ఇంటికి బయల్దేరాం. దారిలో యాపిల్సు కొనుక్కుని తీసుకువెళ్లాం.

మేము వెళ్లేసరికి రామశేషు ముందుగదిలో నవారుమంచం మీద పడుకొని శూన్యంలోకి చూస్తున్నాడు.

వెనకగదిలో వాకిలి ఎదురుగా నిల్చున్న రామశేషు భార్య ఇందిర మమ్మల్ని చూసి "రండి" అంటూ నవ్వుతూ ఆహ్వానించింది. మేం లోపలకు వచ్చిన అలికిడికి తల తిప్పి రామశేషు బలహీనంగా నవ్వాడు.

వాడి మంచం పక్కనే విజిటర్స్‌కోసమన్నట్టు రెండు కుర్చీలు ఉన్నాయి. అందులో కూర్చున్నాం.

గురుదేవరాయలు పండ్లున్న కవర్లను రామశేషు తల పెట్టి పడుకున్న దిండు పక్కన వుంచి "కొంచెం తగ్గిందా?" అనడిగాడు.

"కొంచెం నయం" అని చెప్పింది ఇందిర.

"ఉదయమే తెలిసింది నీ విషయం" అన్నాను రామశేషుతో - గురుదేవరాయలు వంక చూస్తూ.

రామశేషు కళ్లార్పి "నువ్వు వస్తావనే అనుకున్నాను" అన్నాడు ముభావంగా.

ఇందిర గుమ్మంలో లేదు. లోపలకు వెళ్లింది. కాఫీ కోసమయి ఉంటుంది. కొంచెంసేపటికి కాఫీ వాస, కాఫీని గ్లాసుల్లోకి పోస్తున్న చప్పుడూ వినిపించాయి.

కాసేపట్లో ఇందిర ఒక ట్రేలో కాఫీ గ్లాసులను ఉంచి వచ్చింది. రామశేషు ప్రయత్నపూర్వకంగా మంచంమీద లేచి కూర్చుని కాఫీ గ్లాసు అందుకున్నాడు.

మాటలు లేవు. నిశ్శబ్ధం తాండవిస్తోంది. రామశేషు పీల్చుకుపోయాడు. శరీరంలో కాంతి తగ్గింది. రంగు మారింది. వ్యాధి పీడితుడి కళ పడింది.

నాకు తెలిసి రామశేషు తెలివయినవాడు.

డిగ్రీ పూర్తయిన తర్వాత ఉద్యోగం రావటానికి మధ్య వున్న విరామకాలంలో రామశేషు పత్రికలకు కథలు రాశాడు. బాగా రాసేవాడు. ఉద్యోగంలో చేరిన తర్వాత కథలు రాయడం మానేశాడు. అప్పట్లో వాడు సినిమారంగానికి వెళ్లి అక్కడ సినిమా రచయితగా స్థిరపడడానికి ప్రయత్నాలు కూడా చేశాడు.

రామశేషు ఎక్కువగా నేలవిడిచి సాము చేసేవాడు. ఆకాశానికి నిచ్చెనలు వేయడం వాడికి అలవాటు. అందువలన వాడు చేసిన ప్రయత్నాలన్నీ సానుకూలం కాలేదు. చివరకు ఎలాంటి గుర్తింపూ లేకుండా వాడు వాడిగానే మిగిలిపోయాడు.

అసలు రామశేషు కథలు రాయటానికి కారణం నేను. కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే నేను కథలు రాసేవాడిని. నా వెంట తిరుగుతూ నన్ను చూసి వాడు కూడా కథలు రాయడం మొదలుపెట్టాడు. కానీ ఓ రచయితగా పేరు సంపాదించలేకపోయాడు.

ఇందిర కొన్ని యాపిల్ ముక్కలను మా అందరికీ పెట్టింది. ఇందిర నాకు బాగా తెలుసు. ఇందిర అన్నయ్య చంద్రనారాయణ నాకు బాగా స్నేహితుడు. తరచూ చంద్రనారాయణకోసం వాళ్లింటికి వెళుతూ ఉండేవాడిని. నాతో పాటు రామశేషు కూడా వచ్చేవాడు. చివరకు ఆ ఇందిరనే పెళ్లి చేసుకున్నాడు.

రామశేషు మంచంమీద పడుకునే అప్పట్లో సినిమా రచయిత కావటానికి తను చేసిన ప్రయత్నాల గురించి చెప్పాడు. గురుదేవరాయలు ఏదో ముఖ్యమైన పనుందని వెళ్లిపోయాడు. ఇందిర వంటపనిలో ఉంది.

రామశేషు నేను రాస్తున్న కథల గురించి అడిగాడు. చెప్పాను.

మధ్యలో ఇందిర వచ్చి "ఈమధ్య మీరేం రాయలేదా?" అనడిగింది.

"రాస్తున్నాను. వారం క్రితం నేను రాసిన నవల పుస్తక రూపంలో వచ్చింది.

సాయంత్రం తీసుకువస్తాను" అన్నాను.

వెంటనే రామశేషు ఏమాత్రం ఆలస్యం చేయకుండా "వద్దురా" నీ నవల వద్దు. ఈమధ్య నేనేమీ చదవడంలేదు. ఇంట్రస్టు పోయింది. నువ్వు సాయంత్రం శ్రమ తీసుకుని నవల తీసుకురావద్దురా" అన్నాడు అదోలా.

ఆశ్చర్యమనిపించింది. కనీస మర్యాద కూడా లేకుండా వాడలా అంటాడని అనుకోలేదు.ఇందిర మాత్రం "తీసుకురండి. నేను చదువుతాను. నాకు మీ రచనలపట్ల ఇంట్రస్టు వుంది" అన్నది.

నేను వాడి మాటలకు మొహం మాడ్చుకుని వుంటాను. నా మొహంలోని భావాలని ఇందిర చదివినట్టుంది."ఈమధ్య మీ స్నేహితుడికి విసుగు ఎక్కువయ్యింది" అన్నది."అవును" మంచాన పడినవాళ్లకు అలాగే ఉంటుంది" అన్నాను.

రామశేషు మా మాటలను వింటూ పైన తిరుగుతున్న ఫ్యాను చూస్తున్నాడు. వాడేదో ఆలోచిస్తున్నాడని అర్థమయింది. అప్పటివరకు వాడు నాతో మాట్లాడిన మాటల్లో ఎలాంటి ప్రేమ, ఆప్యాయతా లేదు. చిన్నతనంనుంచి కలిసి చదువుకున్నవాళ్లమనే ఫీలింగ్ కూడా లేదు. కనీసం పరిచయం కూడా లేని మనిషితో మాట్లాడినట్టు మాట్లాడాడు.

"మీ ఆరోగ్యం బావుంటుందా?" అడిగింది ఇందిర.

"దేవుడి దయవల్ల ఎలాంటి అనారోగ్యం లేదు. దివ్యంగా ఉన్నాను" అన్నాడు నవ్వి."అదృష్టవంతులు" అని వెళ్లిపోయింది ఇందిర.

ఇందిర వెళ్లిన కొన్ని నిముషాలకు "నాకు నిద్ర వస్తోంది" అని గోడవైపు తిరిగి పడుకున్నాడు రామశేషు. షాకయినాను.

నేను మాట్లాడుతున్నప్పుడే వాడలా చెయ్యడం నాకు బాధనిపించింది.

ఓ నిమిషం తర్వాత వెళుతున్నానని కూడా చెప్పకుండా అక్కడనుంచి బయటకు వచ్చాను. ఇందిర ఏమనుకున్నదో?

ఆ సాయంత్రం ఇందిర ఫోన్‌చేసి "నవల తీసుకురండి. నేను చదువుతాను" అని చెప్పింది. మరోసారి రామశేషు మొహాన్ని చూడడం నాకిష్టం లేకపోయింది. వాడేమిటో వాడి మనసులో యేముందో నాకు పూర్తిగా అర్థమయింది. అందుకే నా నవలను గురుదేవరాయలకు ఇచ్చి ఇందిరకు అందజేశాను.

పదిరోజులు గడిచాయి.

ఓరోజు సాయంత్రం గురుదేవరాయలు మార్కెట్లో కనిపించాడు. ఆ క్రితం

రోజు సాయంత్రమే రామశేషు ఇల్లు ఖాళీచేసి ఇందిరతో నెల్లూరు వెళ్లిపోయాడుట. వాడి ప్రవర్తన గురించి గురుదేవరాయలతో చెప్పాను.

"నిజమే మంచాన పడినవాడి ఆలోచనలు అలాగే ఉంటాయి. ఇందిర ప్రవర్తనలో వచ్చిన మార్పును వాడు గమనించి వుంటాడు. భార్య అసంతృప్తికి తన అనారోగ్యమే కారణమని అనుకొని వుంటాడు. అందుకే బాగా ఆరోగ్యంగా వుండే తన వయసువాళ్లను చూస్తే వాడిలో భయం కలుగుతుంది. వాడేం రచయితో నాకు అర్థం కావటంలేదు. ఇంతమాత్రానికే కాపురం చేస్తున్న ఆడవాళ్లు మొగుళ్లను దూరం చేసుకుని ఇంకో మగాడికోసం పరుగుదీస్తారా? రామశేషుకు నీ పట్ల బాగా జెలసీ కూడా వుంది. అందుకే అంత అయిష్టతను కనబరిచాడు. నువ్వు నవల ఇస్తానన్నా వద్దన్నాను. నాకో విషయం తెలీదు. వాడు బోరుకొడుతుందని నన్నడిగి నాలుగు నవల్లు తీసుకున్నాడు రెండ్రోజుల క్రితం. ఇంకోసారి నువ్వు వాడి మొహం చూడకుండా చేసుకున్నాడు. ఇటువంటి వాడిని స్నేహితుడని అనుకోవడం కూడా వేస్టు. నిన్ను అనవసరంగా వాడి దగ్గరకు తీసుకువెళ్లాడు. "సారీ" అన్నాడు గురుదేవరాయలు.రామశేషు తన జీవితంలో అనుకున్నది ఏదీ ఎందుకు సాధించలేకపోయాడో ఇప్పుడర్థమయింది. వాడు మనసులో పెంచుకున్న అర్థంలేని భయాలవల్లే అన్నింటినీ వదులుకున్నాడు. ఆ భయమే అన్నింటికీ అడ్డు తగిలింది.

ఊహించని విధంగా ఇందిర దగ్గర్నించి నా పేరున ఓ ఉత్తరం వచ్చింది. అందులో –"అన్నయ్యగారికి.... మీ నవల చదివాను. చాలా బాగుంది. కంగ్రాట్స్. ఎలా వున్నారు? ఇంకా బాగా రచనలు చేయండి. మీ నవలను ఈయన మాత్రం చదవలేదు. ఎప్పుడో చదువుతారట. వదినగారికి నమస్కారములు.... ఇందిర.

ఆ ఉత్తరం చదివిన తర్వాత రామశేషు ఎంత ఇడియటో అర్థమయింది. ఇందిర ఇంతకుముందు నాతో ఎన్నోసార్లు మాట్లాడింది. ఎప్పుడూ అన్నయ్య అని సంబోధించలేదు. కానీ ఇప్పుడు ఉత్తరంలో అలా రాసింది. కొంతమంది మనుషులకు ఎదుటివాళ్లను వరసలు పెట్టి పిలవడం ఇష్టముండదు. ఉండే భావమేదో మనసులో ఉంటుంది. బయటకు ఎగ్జిబిట్ చెయ్యడం ఇష్టముండదు. కానీ ఇప్పుడు రామశేషు భార్య దగ్గర కూర్చుని ఇలా రాయించి వుంటాడు. ఇప్పుడు వాడి మనసు తృప్తిపడి వుంటుంది. కొంతమంది మనుషులు ఇలాంటి భ్రమలలో జీవిస్తూ వుంటారు.

రామశేషులో ఉన్న ఈ వ్యాధికంటే ఊపిరితిత్తుల వ్యాధి ఎంతో నయం. ❖

*విశాఖ సంస్కృతి తెలుగు మాసపత్రిక, ఏప్రిల్ 2014*